
సాక్షి ప్రకాశం
గురువారం । 17 । జూలై । 2025



ఇల్లు ఇవ్వరు.. బిల్లు చెల్లించరు
కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా పేదలకు ఒక్క ఇల్లు మంజూరు చేయకపోగా గతంలో కట్టుకున్న ఇళ్లకు బిల్లులు కూడా ఇవ్వడం - 8లో..



టోల్ బాదుడు
శ్రీశైలం వెళ్లే వాహనదారులు డబుల్ టోల్ ఫీజు చెల్లించి నష్టపోతున్నారు. బైర్లూటి వద్ద టోల్ చెల్లించినా అవగాహన లేక గణపతి చెక్‌పోస్టు వద్ద మళ్లీ చెల్లిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
39 /29

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

రేషన్ మాఫియా.. బస్తా మే సవాల్..!

జిల్లాలో పేదల బియ్యం అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోతోంది. అధికార టీడీపీ ప్రజా ప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. రాత్రుళ్లు గుట్టుచప్పుడు కాకుండా పోర్టుల ద్వారా రేషన్ బియ్యాన్ని ఎల్లలు దాటించేస్తోంది. నిరుపేద ప్రజల కడుపులు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముకుంటూ బడా బాబులు బొజ్జలు నింపుకుంటున్నారు. బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల కిందట దర్శిలో ఒక రైస్ మిల్లుపై అధికారులు దాడులు చేసి అక్కడ సుమారు 3 వేల బస్తాలు ఉంటే కేవలం 706 బస్తాలకే కేసు నమోదు చేసినట్టు సమాచారం.

- టీడీపీ కనుసన్నల్లో యథేచ్ఛగా రేషన్ బియ్యం వ్యాపారం
- కీలక మంత్రికి సన్నిహితుడి గుప్పిట్లో జిల్లా రేషన్ మాఫియా
- రాత్రికి రాత్రే కాకినాడ, కృష్ణపట్నం పోర్టులకు తరలింపు
- పాలకుల అండతో మిన్నకుండిపోతున్న అధికారులు
- దర్శిలో అధికారుల తనిఖీల్లో భారీగా రేషన్ బియ్యం పట్టివేత
- మిల్లులో ఉన్న బస్తాలు 3 వేలు.. కేసు నమోదు 706 బస్తాలే
- అధికారులపై ఉన్నత స్థాయి ఒత్తిళ్లు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జిల్లాలో కొత్తపుంతలు తొక్కుతోంది. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వరకు రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే బియ్యాన్ని కార్డుదారులకు అరకొరగా పంపిణీ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 1392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 6,37,820 తెల్లకార్డులు ఉండగా, అంత్యోదయ అన్న యోజన కార్డులు 32,807 ఉన్నాయి. ఈ రేషన్ దుకాణాలన్నీ కూటమి పార్టీల నాయకులకు చెందిన డీలర్ల నిర్వహణలో ఉన్నాయి. దీంతో ఎక్కడికక్కడ రేషన్ దుకాణాలను సిండికేట్ చేసి అక్రమంగా బియ్యాన్ని తరలించి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. జిల్లాకు ప్రతి నెలా 10,582 మెట్రిక్ టన్నుల బియ్యం వస్తోంది. ఇందులోంచి 50 శాతానికి పైగా బియ్యాన్ని తరలించాలని అధికార పార్టీ నాయకులు డీలర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అంటే నెలకు సుమారుగా 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం తరలిపోతుందన్నమాట. ఇందులో కిలోకు 5 రూపాయలు చొప్పున ఆయా నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ కీలక నేతలకు ఇచ్చేలా మాఫియా మధ్య ఒప్పందం జరిగినట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ కీలక నేతలకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ముడుపులు చెల్లించాల్సి ఉంటుందని ఆరోపణలున్నాయి. అలాగే అధికారులకు కూడా ఎవరికి ముట్టచెప్పాల్సింది వారికి ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ ప్రకాశం జిల్లాలో ఒక అధికారికి నెలకు రూ.8 లక్షల వరకు రేషన్ మాఫియా ద్వారా కమీషన్లు ముడుతున్నట్లు ప్రచారం.

పట్టుబడింది 3 వేల బస్తాలైతే 750 బస్తాలకే కేసు...

దర్శి నియోజకవర్గంలోని ఒక రైస్ మిల్లులో రెండు రోజుల క్రితం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 3 వేల (25 కేజీలు) బస్తాల బియ్యం దొరికినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ సమాచారం తెలిసిన వెంటనే టీడీపీ కీలక నాయకురాలు రంగంలోకి దిగినట్లు చెప్పుకుంటున్నారు. పైస్థాయి నుంచి తీవ్రమైన ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. దాంతో కేవలం 750 బస్తాల బియ్యం మాత్రమే దొరికినట్లు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. మిగిలిన బియ్యాన్ని అక్కడే వదిలివెళ్లి పోయారని, ఆ బియ్యాన్ని రాత్రికి రాత్రే ఒంగోలుకు తరలించినట్లు సమాచారం. భారీ మొత్తంలో రేషన్ బియ్యం దొరకడంతో దర్శి నియోజకవర్గ ప్రజలు విస్తుపోయారు.

చక్రం తిప్పుతున్నది వీళ్లే..

రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో కీలకనేతల అనుచరులు, పీఏలు, సోదరులు ఇతర కుటుంబ సభ్యులు పర్యవేక్షిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జికి సన్నిహితుడిగా మెలిగే ఒక నాయకుడు గతంలో పోలీసులతో ఘర్షణకు దిగడం సంచలనం సృష్టించింది. పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు వద్ద దొరికిన రేషన్ బియ్యం వ్యవహారంలో సదరు అనుచర నాయకుడు పోలీసులపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించారు. ఒంగోలులో కీలక నేత వద్ద ఉన్న ఏడుగురు పీఏలలో ఒకరికి రేషన్ బియ్యం వ్యవహారాన్ని అప్పగించినట్లు సమాచారం. గిద్దలూరులో అన్నీ వ్యవహారాలను చక్కదిద్దుతున్న కీలక నేత సోదరుడు రేషన్ అక్రమ రవాణాను పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. కొండపిలో టీడీపీ నాయకుడి తండ్రి కనుసన్నల్లో ఈ వ్యవహారం నడుస్తున్నట్లు సమాచారం. కనిగిరి రేషన్ వ్యాపారాన్ని ఒంగోలు జనసేన నేత చూసుకుంటున్నట్లు చెబుతున్నారు. చీరాలలో రేషన్ బియ్యాన్ని ఒంగోలు టీడీపీ కార్పొరేటర్లు ఇద్దరు నిర్వహిస్తున్నారని సమాచారం. దర్శిలో 10 మంది కూటమి నాయకులను రేషన్ బియ్యం రవాణాకు కేటాయించినట్లు చెప్పుకుంటున్నారు.

జిల్లా కేంద్రంగా రేషన్ మాఫియా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ బియ్యం వ్యాపారానికి జిల్లా.. కేంద్రంగా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక మంత్రికి అత్యంత సన్నిహితుడిగా మెలిగే ఒక కార్పొరేషన్ చైర్మన్ బియ్యం వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని 8 నియోజకవర్గాలతో పాటుగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి, చీరాల రేషన్ బియ్యాన్ని సైతం జిల్లా నాయకులే కొనుగోలు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. దాంతో మొత్తం 10 అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ఒక అవగాహన కుదుర్చుకున్న సదరు నాయకుడు జిల్లా కేంద్రంలో రెండు రైస్ మిల్లుల ద్వారా బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. పశ్చిమ ప్రకాశం నుంచి వచ్చే బియ్యాన్ని కర్నూలు రోడ్డులోని పీర్లమాన్యంలో ఒక రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. తూర్పు జిల్లా నుంచి వచ్చే బియ్యాన్ని తీరప్రాంతం నుంచి తరలించి ఈతముక్కల గ్రామంలోని ఒక రైస్ మిల్లులో నిల్వ చేసి అక్కడ నుంచి కృష్ణపట్నం, కాకినాడ పోర్టులకు తరలిస్తున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

నేడు రెజాంగ్ లా రాజ్ కలశ రథయాత్ర

ఒంగోలు సబర్బన్: భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్ (యాదవ రెజిమెంట్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న రెజాంగ్ లా రాజ్ కలశ రథయాత్ర గురువారం ఉదయం 8 గంటలకు పెళ్లూరులోని గంగమ్మ గుడి (నేషనల్ హైవే) నుంచి ప్రారంభమవుతుందని అఖిల భారత యాదవ మహా సభ నాయకులు తెలిపారు. ఈ మేరకు యాదవ మహాసభ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు బొట్ల రామారావు యాదవ్, బొల్లు సుబ్బారావు యాదవ్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పవిత్ర యాదవ వీరుల జ్ఞాపకార్థం లక్ష కిలో మీటర్ల మేర సాగే యాత్రను యాదవ పెద్దలు, నాయకులు, యువకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రెజాంగ్ లా రాజ్ కలశ్ యాత్ర ఏప్రిల్ 13 వ తేదీన బీహార్ లోని పాట్నా నుంచి మొదలైందన్నారు.

నేడు రోల్‌బాల్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: రోల్‌బాల్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక స్థానిక మంగమూరు రోడ్డులోని ప్రగతి ఎన్‌క్లేవ్ వద్ద గురువారం ఉదయం నిర్వహిస్తున్నట్లు రోల్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి గుర్రం అనీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 11, 14, 17, 17 ప్లస్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఎంపిక ఉంటుందన్నారు. ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా జట్టును ఎంపిక చేసి వారిని ఈనెల 19, 20 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు పంపుతారన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, రోల్ బాల్ ఆఫ్ ఇండియా వారిచే ధ్రువీకరించిన గుర్తింపు పత్రం తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఇన్‌చార్జి గుర్రం అనీల్‌కుమార్, సెల్:9100553717ను సంప్రదించాలన్నారు.

సెల్ ఫోన్ మరమ్మతులపై ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు రూడ్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ మరమ్మతుపై ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఆ సంస్థ డైరక్టర్ పి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి 30 రోజుల పాటూ సెల్ ఫోన్ మరమ్మతు, సర్వీసింగ్‌పై ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండాలని, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో పూర్తి వసతి, భోజనం ఉచితంగా అందిస్తారని చెప్పారు. ఇతర పూర్తి వివరాలకు 8309915577 అనే నెంబరుపై సంప్రదించాలన్నారు.

బీఈడ్ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం పరిధిలోని 110 బీఈడ్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం, మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను ఏకేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి సూచనల మేరకు ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు బుధవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ పరీక్షలకు గాను మొత్తం 11,331 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 10,481 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో మొత్తం 10,394 మంది విద్యార్థులు పాసైనట్లు హరిబాబు విలేకర్లకు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డి.వి.ఆర్.మూర్తి, బి.హరిబాబుతో పాటు ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నిర్మలామణి, సీతఈ ప్రొఫెసర్ జి.సోమశేఖర, పూర్వపు సీతఈ, ప్రస్తుత సీడీసీ డీన్ డాక్టర్ కే.వి.ఎస్.రాజు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పీజీ కో ఆర్డినేటర్ (నాన్ కాన్ఫిడెన్షియల్ విభాగం) డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

345 బేళ్లు తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 345 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెట్లూరు ఎస్.ఎస్. కండ్రిక, జగ్గరాజుపాలెం, వర్ధినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1070 బేళ్లను వేలానికి తీసుకురాగా 725 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.225.90గా నమోదైంది. వేలంలో 23 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం సరళమైన విధానం



ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు: మధ్యవర్తిత్వం సరళమైన, వేగవంతమైన విధానం అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం నుంచి శ్రీపొట్టి శ్రీరాములు బొమ్మ వరకు బుధవారం నిర్వహించిన మీడియేషన్ ఫర్ నేషన్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియేషన్‌లో పరిష్కారమైన కేసులకు సంబంధించి న్యాయస్థానాల్లో చెల్లించిన కోర్టు ఫీజును కూడా తిరిగి పొందవచ్చన్నారు. ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యల పరిష్కారానికి న్యాయవాదులు సంపూర్ణంగా సహకరిస్తారన్నారు. కార్యక్రమంలో మధ్యవర్తిత్వం మీద శిక్షణ పొందిన న్యాయవాదులు అయినాబత్తిన సుబ్బారావు, సిరిగిరి సరళ, దేవకుమారి, అదనపు ప్రభుత్వ న్యాయవాది బోడపాటి వెంకట శివరామకృష్ణ ప్రసాద్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గొల్లకారం రవిశంకర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.వీరరాఘవులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చీమకుర్తి: చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో పదో తరగతి, సీనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది 9వ తరగతి పూర్తి చేసి 60 శాతం మార్కులు సాధించిన వారు, గతేడాది జూనియర్ ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన వారు గురువారం సాయంత్రం 5 గంటల్లోపు తమ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు.

పురుగుమందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న సెంట్రల్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసరావు

పెద్దారవీడు: గుంటూరు వ్యవసాయ కమిషనర్ అనుమతించిన ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ లేని వివిధ రకాల పురుగుమందుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సెంట్రల్ స్క్వాడ్ అధికారి టి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో హనుమాన్ జంక్షన్ కుంటలో పురుగుమందులు, విత్తనాల దుకాణాలను నెల్లూరు విజిలెన్స్ సీఐ షేక్ సుహాని, జిల్లా సాంకేతిక వ్యవసాయాధికారి వేణుగోపాల్ బృందం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. రాష్ట్ర కమిషనర్ కార్యాలయం సూచించిన అనుమతి పత్రాలు చూపించని కారణంగా రూ.58.28 లక్షల విలువైన 12,427 కేజీల పురుగుమందుల అమ్మకాలను తాత్కాలింగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లోని వివరాలకు గోడౌన్‌లో ఉన్న స్టాక్‌కు, ఎరువుల ఇన్‌వాయిస్‌లు, రైతులకు ఇచ్చిన బిల్లులను పరిశీలించారు. సెంట్రల్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికృత డీలర్ల నుంచి మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు చట్టాలకు లోబడి మాత్రమే వ్యాపారం చేసుకోవాలని, అతిక్రమిస్తే లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువకు అమ్మరాదని చెప్పారు. ఆయన వెంట మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బాలజీనాయక్, మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, ఏఈఓ సునీల్‌నాయక్, ఉన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది విధుల నుంచి తొలగింపు



లక్షిత్ (ఫైల్)

కంభం: మండలంలోని లింగోజిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఈనెల 8వ తేదీ అదృశ్యమై 10వ తేదీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పొదిలి లక్షిత్ మృతికి పరోక్షంగా అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం కూడా ఒక కారణమని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల పీడీ సువర్ణ విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించిన నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్ కె.గోవిందమ్మ, ఆయా ఎ.కృష్ణకుమారిని విధుల్లో నుంచి తొలగిస్తూ బుధవారం కలెక్టర్ నుంచి ఉత్తర్వులు రాగా ఆ ఉత్తర్వులను సిబ్బందికి అందజేసినట్లు సూపర్ వైజర్ గాలెమ్మ తెలిపారు.

బాలుడి మృతి కేసు దర్యాప్తులో లేని పురోగతి:
బాలుడు మృతి చెంది వారం రోజులు కావస్తున్నా కేసులో ఎటువంటి పురోగతి లేనట్లు తెలుస్తోంది. ముక్కుపచ్చలారని బాలుడి అనుమానాస్పద మృతి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నేపథ్యంలో మృతికి కారకులైన వారిని పోలీసులు త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని బాలుడి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ



వైఎస్ జగన్‌ను కలిసిన శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం తాడేపల్లిలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ పరామర్శించారు. పార్టీ, తాము అండగా ఉంటామని ఆమెకు భరోసా ఇచ్చారు. ఒక బీసీ మహిళ పార్టీ సమావేశానికి వెళ్తుంటే ఆమె వాహనాన్ని ధ్వంసం చేయడమే కాకుండా ఆమెపై దాడికి పాల్పడడం సబబు కాదన్నారు. అనంతరం వారు తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- ఒంగోలులో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మొదటి రోజు సమ్మె



ర్యాలీ నిర్వహిస్తున్న ఒంగోలు నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు

ఒంగోలు సబర్బన్: షరతులు లేకుండా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ కార్మికుల సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలు నగర మున్సిపల్ పారిశుధ్య కార్మికులు బుధవారం మొదటి రోజు సమ్మె నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కొర్నెపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, గత 17 రోజులు సమ్మె కాల ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని కోరారు. చనిపోయినా, ఆరోగ్యం బాగాలేని కార్మికులకు వాళ్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో ఎంప్లాయ్ కోడ్ లింకును తీసివేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవ చేసే మున్సిపల్ కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయిస్తూ పట్టించుకోకపోవటం దారుణమన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ చనిపోయినా, ఆరోగ్యం బాగాలేని కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఖాళీ అయిన స్థానాల్లో టీడీపీ కార్యకర్తలను ఆప్కాస్‌లో చేర్పిస్తున్నారని ధ్వజమెత్తారు. ఖాళీ పోస్టుల స్థానంలో కోవిడ్ కార్మికులను ఆప్కాస్ లోకి తీసుకోవాలని, లేకుంటే ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వై రవి, ఏం బాబు, ఆర్ శ్రీనివాసరావు, బి బాబు, కే వెంకటేశ్వర్లు, కే యాకోబు, యూనియన్ నగర కార్యదర్శి విజయమ్మ, అనిత, బందెల సుబ్బారావు, కసుకుర్తి వెంకటేశ్వర్లు, ఆనంద్, కే మోహన్‌రావు, ఆర్ రాములు, కే సామ్రాజ్యం, పి పద్మ, కమల, కే వంశీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పాలకులకు పట్టవా..

- ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం ముందు ఇంజినీరింగ్ సిబ్బంది ధర్నా



కార్మికుల ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కార్మికులు సమ్మె చేస్తున్నా పాలకులకు ఏ మాత్రం పట్టడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు ధ్వజమెత్తారు. స్థానిక ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె కొనసాగింపులో నిరసన కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. యూనియన్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు కూడా పిలవకుండా పక్కదారులు పట్టించే పద్ధతిలో ఉందని మండిపడ్డారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్ ప్రకారం వేతనాలు చెల్లించకుండా అందరికీ ఒకే తరహా వేతనాలు చెల్లించటం మోసగించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షాన లేకుండా, వేతనాల పెంచకుండా సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం మున్సిపల్ అధికారులతో పోటీ కార్మికులతో పని చేయించుకునే పద్ధతిలో ఉండటం అత్యంత దారుణమని ధ్వజమెత్తారు.

ఆర్టీసీ ఎస్‌టీడబ్ల్యూఎఫ్ ఒంగోలు బ్రాంచ్ ఒంగోలు డిపో కమిటీ కార్మికులకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.హైపురెడ్డి మాట్లాడుతూ కార్మికులకు కనీసం వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. చట్టాలు అమలు చేయడంలో కార్మికుల పక్షాన నిలవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, జీ రమేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసరావు, ఇంజినీర్ కార్మికులు, యూనియన్ నాయకులు కే జాలయ్య, కే వెంకటరావు, కే మోహన్ రావు, సుధాకర్, ప్రసన్న, శ్రీదేవి, శివమ్మ, వంకాయల ప్రతాప్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెల్లని చెక్కు కేసులో జైలు

గిద్దలూరు రూరల్: చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేసిన కేసులో హెచ్ఎంపాడుకు చెందిన రాచూరి రంగారావుకు గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.భరత్‌చంద్ర ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన దాసరి బాల సుబ్బయ్య వద్ద హెచ్ఎంపాడుకు చెందిన రంగారావు 2016 లో వ్యక్తిగత కారణాలపై నగదు తీసుకొని చెల్లని చెక్కు ఇచ్చాడు. ఈ మేరకు బాధితుడు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు.

మున్సిపల్ కార్మికుల వంటావార్పు



వంటావార్పు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం టౌన్: సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెను ఉధృతం చేశారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి డీకే రఫీ మాట్లాడుతూ జీఓ నం.36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికీ సంక్షేమ పథకాలు, స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. గత 4 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డీఎంఏ కార్యాలయం వద్ద జరిగే నిరసనలో కార్మికులు పాల్గొనాలని అన్నారు. సమావేశంలో రూబెన్, సుబ్బరాయుడు, హరికృష్ణ, చెన్నరాయుడు, అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు. కార్మికుల సమ్మెకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు జవ్వాజీ రాజు తెలిపారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు



మామిడిపాలెంలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఆర్‌ఓ

ఒంగోలు సబర్బన్: ఏపీపీఎస్సీ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తోంది. ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని మొత్తం 6 సెంటర్లలో పరీక్ష జరుగుతోంది. రెండో రోజు బుధవారం ఒంగోలు నగరం మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా కాలేజీలో ఉదయం పరీక్షకు 170కు గాను 68 మంది, మధ్యాహ్నం పరీక్షకు 135 కి గాను 62 మంది హాజరయ్యారు. అదే విధంగా ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో జరిగిన పరీక్షకు 97 మందికి గాను 41 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు సందర్శించారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న పరీక్ష తీరును ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఆస్తి కోసం వేధిస్తున్నారని తల్లి ఫిర్యాదు

- కుమార్తె, అల్లుళ్లపై కేసు నమోదు

పెద్దదోర్నాల: ఆస్తి కోసం తనను వేధిస్తున్నారంటూ కొత్తూరుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సై మహేష్ ఆమె కుమార్తె, అల్లుళ్లపై కేసు నమోదు చేశారు. కొత్తూరుకు చెందిన ఓ వితంతువుకు చెందిన వ్యవసాయ భూమిలో వేసిన పత్తి పంటను సోమవారం ఆమె కుమార్తె, అల్లుళ్లు కలిసి ధ్వంసం చేశారని ఆమె ఆరోపించిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో తల్లి యేరువ చిన్నమ్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మహేష్ మాట్లాడుతూ ఆస్తి కోసం తల్లిదండ్రులను వేధిస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు. మహిళ ఫిర్యాదుపై దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

కరేడులో మానవ హక్కుల వేదిక నాయకుల పర్యటన



కరేడులో పర్యటిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

ఉలవపాడు: మండలంలోని కరేడు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం మానవ హక్కుల వేదిక నాయకులు పర్యటించారు. పరిశ్రమలకు భూ సేకరణను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులకు సంఘీభావంగా కరపత్రాలు పంచిపెట్టారు. ప్రజల ఆమోదాన్ని కాదని భూసేకరణ చేయడాన్ని వారు వ్యతిరేకించారు. ప్రాజెక్టును తక్షణమే రద్దు చేసి భూ సేకరణ ప్రకటనలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర కార్యదర్శి రోహిత్, రాష్ట్ర చేనేత జనసమాఖ్య అధ్యక్షుడు మోహన్ రావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు ఇవ్వరు.. బిల్లు చెల్లించరు..!

పేదల గృహాలపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. ఎన్నికలకు ముందు అది చేస్తాం.ఇది చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలిచ్చిన కూటమి నేతలు..అధికారంలోకి వచ్చి ఏడాదైనా పేదలకు ఒక్క ఇల్లూ ఇవ్వలేదు. ఒక్క రూపాయి బిల్లు కూడా మంజూరు చేయలేదు. ఓ పక్క పెరిగిన ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు, మరో పక్క కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం.. వెరసి ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా పేదలకు ఒక్క గృహం కూడా మంజూరు చేయలేదు. పాత గృహాలకు కూడా బిల్లులు మంజూరు కావడం లేదు. దీనితో పేదల పక్కా గృహాల నిర్మాణాలు నత్తనడకతో పోటీపడుతున్నాయి.

చెప్పారంటే..చేయరంతే..

అధికారంలోకి వస్తే 2014 నుంచి 2019 వరకు కట్టిన గృహాలకు కూడా బిల్లులు తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. దీంతో లబ్ధిదారులంతా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 8837 గృహాలను శ్రావణమాసం నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 4791 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో కొన్ని మాత్రమే పూర్తయ్యాయి. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందకపోవడం, సిమెంట్, ఇటుక, ఇసుక, ఇనుము ధరలు పెరగడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు వెనుకడుగు వేస్తున్నారు. అయితే గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖాధికారులపై ఒత్తిడి తెస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల నుంచి స్పందన లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో దర్శి, యర్రగొండపాలెం, కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు తదితర ప్రాంతాల్లో గృహ నిర్మాణాలు మందగించాయి. శ్రావణ మాసానికి గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ అధికారులపై కత్తి పెట్టింది. దీంతో ప్రతిరోజూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇల్లు కట్టుకోమని పోరుపెడుతుంటే డబ్బులెవరిస్తారంటూ లబ్ధిదారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు చంద్రబాబు ప్రకటనతో 2014 నుంచి 2019 మధ్య ఇల్లు కట్టుకున్నవారు కూడా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.

మొండిగోడలకు మోక్షమెప్పుడో..!

- బిల్లుల కోసం ఇళ్ల లబ్ధిదారుల ఎదురు చూపులు
- లక్ష్యానికి 50 శాతం మాత్రమే పూర్తి
- పూర్తి కావాల్సిన గృహాలు 8837
- వివిధ దశల్లో పూర్తయినవి 4791 గృహాలు

గతమెంతో ఘనం..

2019–2024 మధ్య కాలంలో ఇళ్ల లబ్ధిదారులకు స్వర్ణయుగమే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి పట్టాలు ఇచ్చి గృహాలు మంజూరు చేశారు. అర్హులైన పేదలు సొంతిల్లు కావాలంటే ఎప్పుడైనా ఇంటికి దగ్గరలో ఉన్న సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే..సిబ్బంది పరిశీలించి వెంటనే మంజూరు చేసేవారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల నగదుతో పాటు ఇంకా అవసరమైతే బ్యాంకు ద్వారా ఆర్థిక సాయం అందించింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు సైతం చేసుకున్నారు. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గ్రామాలు, కాలనీలే ఏర్పడ్డాయి.



మార్కాపురం ఇడుపూరు లే అవుట్‌లో బేస్‌మెంట్ లెవెల్లో ఆగిన నిర్మాణాలు

కనీస సౌకర్యాలు నిల్...

కాలనీల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఉంటున్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇడుపూరు లేఅవుట్‌లో రోడ్లు, డ్రైనేజీ లేక అవస్థలు పడుతున్నారు. వాటిని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ప్రారంభం కాక పిచ్చిచెట్లు మొలిచిన దృశ్యం

పేదల ఇళ్లపై కక్ష కట్టి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదల గృహాలపై కక్ష కట్టింది. బిల్లులు మంజూరు చేయగా..కట్టుకుంటావా.. లేదా.. అంటూ గృహ నిర్మాణ శాఖ అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తోంది. వివిధ కారణాలతో పలువురు పేదలు గృహాలను ఇంకా ప్రారంభించలేదు. దీంతో వైఎస్సార్ జగనన్న కాలనీలను రద్దు చేసే కుట్రకు ప్రభుత్వం తెరలేపింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలువురు పేదలకు ఈ నిర్ణయం పిడుగులాగా మారింది. ఏడాది కాలంలో ఒక్క ఇల్లూ మంజూరు చేయకపోగా ఉన్న వాటిని రద్దు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణంలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

- మార్కాపురం పట్టణంలోని ఇడుపూరు లేఅవుట్ -1, 2 లో 2,330 గృహాలు మంజూరు కాగా 920 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. మరికొన్ని గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇక 2014–19 మధ్య కట్టుకున్న 1546 గృహాలకు రూ.4 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ఇంత వరకు ఒక్క రూపాయి కూడా మంజూరుకాలేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం:

బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కాలనీల్లో కనీస సౌకర్యాలైన రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. రూ.4 కోట్ల బకాయిలు ఉన్నాయని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే అందిస్తాం.

పవన్‌కుమార్, హౌసింగ్ డీఈ, మార్కాపురం

ఒంగోలులో పుస్తక మహోత్సవం

- ఆగస్టు 15వ తేదీ నుంచి 10 రోజుల పాటు
- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: విజయవాడ బుక్ ఫెస్టివల్స్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, గ్రంథాలయ శాఖ సంయుక్తంగా ఆగస్టు 15 నుంచి 10 రోజుల పాటు మూడో పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, మనోహర్ నాయుడు తెలిపారు. పుస్తక మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి 24వ తేదీ వరకు పది రోజుల పాటు పుస్తక మహోత్సవాన్ని నగరంలోని పీవీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. పుస్తక ప్రదర్శనలో ప్రముఖ పబ్లిషర్స్ వంద స్టాల్స్ వరకు ఏర్పాటు చేస్తారన్నారు. ప్రతిరోజూ సాయంత్రం సాహిత్య, సాంస్కృతిక వి/ఙ్ఞాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పుస్తక మహోత్సవంలో సైన్స్ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పుస్తక పఠనంపై మక్కువ పెంచాలనే ఉద్దేశంతో ఈ పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు నాయక్, కార్యదర్శి ఆర్ రామకృష్ణ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి అలుగుల సురేష్, పాల్గొన్నారు.



బుక్ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నిర్వాహకులు

వైఎస్ జగన్‌ను కలిసిన చుండూరి



ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

కూలీలు రాకుండానే హాజరు

- రూ.11.32 కోట్ల ఉపాధి పనులపై ప్రజావేదిక
- అధికారులు, సిబ్బందికి జరిమానా
- రూ.2.53 లక్షల రికవరీ చేయాలని ఆదేశం



ఈసీ భార్గవిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ జోసెఫ్

సింగరాయకొండ: 'కూలీలు రాకుండానే హాజరు వేశారు. చేసిన పనుల్లో కొలతలు తేడా ఉన్నాయి, కొన్ని ప్రాంతాల్లో యంత్రాలతో పనులు కానిచ్చేశారు' అని సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో నివేదిక చదివి వినిపించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.11.32 కోట్ల పనులపై సామాజిక తనిఖీ బృందం చేపట్టిన విచారణ వివరాలను బుధవారం ప్రజావేదికలో వివరించారు. ఈ సందర్భంగా పీడీ జోసెఫ్ గతంలో ఈసీగా పనిచేసిన భార్గవి, కొన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రూ.2.53 లక్షలు కొలతల్లో తేడా వచ్చిందని, ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి రూ.44,500, రూ.3,,600 జరిమానా కింద అధికారులు, సిబ్బంది నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. రూ.1.64 లక్షల పనులకు సంబంధించి ఏపీడీ సుబ్బారావును విచారించాలన్నారు. కూలీలకు చేసిన పనులకు సంబంధించి రావాల్సిన రూ.88,246 వారి ఖాతాలకు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రతి కూలీకి దినసరి వేతనం రూ.306లుగా ప్రభుత్వం నిర్ణయించిందని, సరాసరిన రూ.250 వస్తుందని తెలిపారు. దీనిపై పలువురు వారానికి రూ.100 ఇచ్చిన కూలీలకు రూ.1200 జమవుతున్నాయని, నగదు ఇవ్వని వారికి కేవలం రూ.600 మాత్రమే జమవుతున్నాయని, అలాంటప్పుడు సరాసరి రూ.250 ఎలా పడుతుందని ప్రశ్నించారు. తక్కువ మంది కూలీలు వస్తే ఎక్కువ మంది వచ్చినట్లు హాజరు వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయని చెప్పగా, యర్రగొండపాలెం, చుట్టుపక్కల మండలాల్లో ఈ సంస్కృతి ఉందని ఇక్కడ కూడా ఉందా అని పీడీ మండల అధికారులను ప్రశ్నించడంతో వారంతా విస్తుపోయారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.జయమణి, ఏపీఓలు సుభాషిణి, సుధాకర్, ఎస్ఆర్‌పీ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌తో పనితీరు వేగవంతం

- జిల్లా పోలీసులకు ఆధునిక కంప్యూటర్లను అందజేసిన ఎస్పీ



పోలీస్‌స్టేషన్లకు ఆధునిక కంప్యూటర్లు అందజేస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: జిల్లాలోని అన్నీ పోలీస్‌స్టేషన్లలో టెక్నాలజీ వినియోగం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పోలీసు శాఖ ఆధునీకరణలో భాగంగా బుధవారం పోలీస్‌స్టేషన్లకు ఆధునిక డిజిటల్ పరికరాలను ఎస్పీ అందజేశారు. 176 ఆల్‌ఇన్ వన్ కంప్యూటర్లు, 44 వెబ్ కెమెరాలు, 48 ప్రింటర్లను ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన పరికరాలను అందించినట్లు తెలిపారు. కేసు నమోదు నుంచి దర్యాప్తు, విచారణ, న్యాయ ప్రక్రియ, కేసు ముగింపు వరకు సాగే ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేలా చేసేలా ఈ ఆధునిక పరికరాలు ఉపయోగపడతాయన్నారు. పాత టెక్నాలజీకి బదులు నూతన కంప్యూటర్ల పనితీరు పోలీసు శాఖకు ఎంతో ఉపయుక్తం అవుతాయని చెప్పారు. కేసులు మరింత పారదర్శకంగా ఉండేలా, ప్రజలు తమ కేసుల స్థితిగతులను ఆన్‌లైన్లో తేలికగా తెలుసుకునేందుకు అవకాశం కల్పిస్తాయన్నారు. పర్చువల్ విచారణలు, వీడియా రికార్డింగ్, సాక్ష్యాల డిజిటల్ స్టోరేజీ వంటి ఆధునిక విధానాలకు అనుగుణంగా ఉపయోగపడతాయని తెలిపారు. క్రైమ్ అనాలిసిస్, డేటా ఇంటిగ్రేషన్, నేరాల నిరోధంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, మహిళా పీఎస్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, సీఐలు నాగరాజు, మేడా శ్రీనివాసరావు, విజయకృష్ణ, సుధాకర్, హజరత్తయ్య, శ్రీకాంత్, డీటీసీ సీఐ షమీముల్లా, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

టోల్ బాదుడు..!

- శ్రీశైలం వెళ్లే వాహనాలకు డబుల్ టోల్ వసూలు
- గణపతి వద్ద చెక్‌పోస్టు వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేసిన అధికారులు
- భైర్లూటి వద్ద చెల్లించినా, అవగాహన లేక రెండోసారి టోల్ చెల్లింపు
- తెలియక నష్టపోతున్న కర్నాటక, రాయలసీమ జిల్లాల వాహనదారులు



మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిలో ఉన్న గణపతి చెక్ పోస్టు

పెద్దదోర్నాల: శ్రీశైలం వెళ్లే రహదారిలో గణపతి చెక్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌తో వాహనదారులు రెండోసారి టోల్ రుసుం చెల్లిస్తూ వారికి తెలియకుండానే నష్టపోతున్నారు. వివరాల్లోకి వెళితే..నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణించే వాహనాలు విధిగా పర్యావరణ పరిరక్షణ రుసుంను చెల్లించేలా పెద్దదోర్నాల మండల కేంద్రం సమీపంలోని గణపతి వద్ద ఓ చెక్ పోస్టు, కర్నూల్ రోడ్డులోని కొర్రప్రోలు వద్ద మరో చెక్ పోస్టును అటవీశాఖ అధికారులు గతంలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లా శిఖరం, చెక్ పోస్టు వద్ద, భైర్లూటి చెక్ పోస్టుల వద్ద ఒక్కసారి రుసుం చెల్లిస్తే మరే చెక్‌పోస్టు వద్ద రుసుంను చెల్లించకుండా నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణించవచ్చు. ఈ ప్రక్రియను కొంత కాలం వరకు మాన్యువల్‌గా నిర్వహించేవారు. దీంతో నంద్యాల జిల్లా భైర్లూటి చెక్ పోస్టు వద్ద టోల్ రుసుమును చెల్లించిన వాహన దారులు అక్కడ చెల్లించిన రశీదులను చూపించి గణపతి చెక్ పోస్టును దాటేవారు. అయితే కాలక్రమేణా గణపతి చెక్ పోస్టు వద్ద టోల్ గేట్‌ను ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు ఫాస్టాగ్ యంత్రాన్ని సమకూర్చారు. దీంతో గతంలో కార్లు, చిన్నపాటి వాహనాలకు రూ.50, లారీలు, పెద్ద వాహనాలకు రూ.100 వసూలు చేసే అధికారులు టోల్ గేట్ పెట్టిన నాటి నుంచి రేట్లను పెంచి కార్లకు రూ.70, లారీలకు రూ.130 టోల్ ఫీజుగా నిర్ణయించి వసూలు చేస్తున్నారు.

అవగాహన లేక నష్టపోతున్న వాహనదారులు

గణపతి చెక్ పోస్టు వద్ద ఉన్న రహదారిని రెండు భాగాలుగా విభజించిన అధికారులు ఒక రహదారి శ్రీశైలం వెళ్లేదిగా, రెండో రహదారిని శ్రీశైలం నుంచి వచ్చేదిగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శ్రీశైలం వెళ్లే రహదారిలో ఆటోమేటిగా టోల్ రుసుం వసూలు చేసేలా యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అవగాహన లేని కొందరు వాహనదారులు భైర్లూటి చెక్ పోస్టు వద్ద టోల్ చార్జీని చెల్లించినా, తిరిగి గణపతి చెక్ పోస్టు వద్ద వారికి తెలియకుండానే రహదారిలో ప్రయాణించి టోల్ రుసుంను చెల్లిస్తున్నారు. చెక్ పోస్టు గేట్‌ను దాటిని తరువాత తమ తప్పును తెలుసుకున్నా, చేసేది లేక గమ్మున్న ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో కర్నాటక, కర్నూల్, నంద్యాల, అనంతపురం తదితర జిల్లాలకు చెందిన పలువురు వాహనదారులు తమకు తెలియకుండానే టోల్ రుసుంను రెండోసారి చెల్లించి నష్టపోతున్నారు. అటవీశాఖ అధికారులు ఈ విషయంపై వాహనదారులకు అవగాహన కలిగించేలా చర్యలు తీసుకొని, భైర్లూటి వద్ద టోల్ రుసుం చెల్లించిన వాహనాలను మరో మార్గంలో పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



ఫాస్టాగ్ ద్వారా రెండోసారి రుసుంను చెల్లిస్తున్న వాహనదారుడు